మినీకథ

# వాయిదాల వల

-ఎ. సుబ్బలక్ష్మి

మూర్తికి లక్ష్మికి పెళ్ళి జరిగి ఆరు నెలలయింది. పెళ్ళి అయిన తరువాత మొదటి ముఖ్యమైన పండుగ ఉగాది ఇంక రెండు రోజులే వుంది. సాయంకాలము ఆఫీసు నుండి రాగానే లక్ష్మిని తొందరగా రెడీ అవమని, షాపింగుకెళ్దామని తొందర చేశాడు మూర్తి. సమాధానంగా క్రొత్త పేపర్ ప్యాకెట్ ఒకటి తెచ్చి అతని చేతిలో పెట్టింది చిరునవ్వుతో లక్ష్మి. ఏమిటి! అపుడే చీరకొనేశావే! అంటూ ప్యాకెట్ విప్పాడు. నెమలి రంగు జరీ బార్డరుగల పట్టుచీర.

చాలా బావుంది నీ సెలక్షను అంటూ కళ్ళెగరేశాడు.

బావుంటుంది కనుకనే మీరు యిక్కడున్నారు, చిలిపిగా నవ్వింది.

చీర నేత చూస్తున్న మూర్తికి ఆ మాటలర్థం అవడానికి ఒక నిమిషం పట్టింది. మురిపెంగా భార్యను చూచి ఇంతకీ రేటు చెప్పలేదు. ఎంత? ఎక్కడ? ప్రశ్నార్థకంగా చూశాడు. “నాలుగు వందలాయాభై! ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతిలో తీర్చాలి!” ఫరావాలేదని మెచ్చుకోలుగా చూస్తాడనుకొంటూ చూచింది—ప్యాకెట్ ఎగిరి వచ్చి మీద పడింది. అదిరి పడింది లక్ష్మి. మూర్తి దవడ కండరాలు బిగుసుకున్నాయి.

“ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతి అంటే నాకు మంట! ఎవరు కొనమన్నారు? ఘనకార్యము చేసినట్లు చెపుతున్నావు. నన్నడగకుండ నిన్నెవరు కొనమన్నారు చీర. అంతా ఆడపెత్తనం కాకపోతే” అరుస్తూనే వున్నాడు.

బెదిరిన లేడిలా చూసింది ఆమె. అసలు భర్తకు అంత కోపం ఎందుకు వచ్చిందో. అంతలేసి మాటలు ఎందుకంటున్నాడో అర్థం కాలేదు. మొదటిసారిగ భర్తకోపం చవిచూస్తూంది. కన్నీరాగలేదు. మూగగా చూస్తూ వుండిపోయింది.

కన్నీళ్ళతో వణికే పెదవులతో భయంగా, మూగగా తనకేసి చూస్తున్న భార్యను చూడగానే అతని కోపం గాలి తీసిన బెలూన్‌లాగా కరిగిపోయింది. ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతి తనకు సరిపోదని లక్ష్మికేం తెలుసు? ఇంకెప్పుడూ అలాకొనకని నెమ్మదిగా చెప్పి వుండాల్సింది. అనవసరంగా ఏడిపించాను. ఛీ! అనుకుంటూ జాలిగొలుపుతూ నిలబడ్డ ఆమె దగ్గరకు నడిచాడు.

“సారీ లక్ష్మి. నాకు చిన్నప్పటి నుంచి అంతే! అమ్మ స్టీలు బిందెలు, అండాలు వాయిదాల పద్ధతిలో కొన్నపుడు కూడ ఇలాగే రభస చేశాను. నాన్న చెల్లికి బంగారం తీసినపుడు ఇంట్లో చిన్నసైజు యుద్ధమే జరిగింది. ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతి అంటే చాలా మోసం లక్ష్మి! నూరు రూపాయల వస్తువు రెండు వందలు చెప్తారు. వడ్డీకి, చక్రవడ్డీ, ఆ చక్రవడ్డీకి



చక్రవడ్డీ లాగుతారు. ఒక్కసారి ఇవ్వాలంటే బరువు కదా! వాయిదాల పద్ధతిలో చెల్లించటం అంత బాధ అనిపించదని మీరనుకుంటారు. కాని అందులోనే వుంది మోసం! ఇంకెపుడూ కొనకు” అంటూ ఇంకా ఆగని ఆమె కన్నీటిని తుడిచి, టవలందుకుని బాతురూము వైపుగా వెళ్ళాడు మూర్తి.

కట్నం తీసుకోవటమంటేనే అతనికి మంట అనుకుంది కాని ఇన్‌స్టాల్‌మెంట్స్ అంటే అంతకంటే తగని మంట అని ఇపుడే తెలుసుకుంది తను. అతనికి తెలియకుండా అతని నాన్నగారు ఇరవైవేల రూపాయల కట్నం అడిగిన తీరు, మంచి సంబంధమని నాన్నగారు అంతా ఒకసారిగ ఇవ్వలేనని సంటరాగానే కొంత కొంతగా ఇస్తాననడము, అబ్బాయికి తెలిస్తే మొదటికే మోసం వస్తుందని చేసేది లేక తన మామగారు వప్పుకోవడం, పెళ్ళి జరగడం కనుల ముందు సినిమా రీలులా కదిలింది.

ఇరవై వేల రూపాయలకు తాను అమ్ముడుపోయానని, అదీ ఇన్‌స్టాల్‌మెంట్స్ పద్ధతిలో అని అతనికి తెలిస్తే! అమ్మో! ఊహించకోలేక వంటగదిలోకి పరుగుతీసింది లక్ష్మి.

*